


కొంగరకలాన్‌లో హోర్డింగ్‌ను తొలగిస్తున్న హైడ్రా బృందం

ఆదిభట్ల మున్సిపాలిటీలో 'హైడ్రా'

- అనుమతి లేని హోర్డింగ్‌లను తొలగించిన అధికారులు
- మున్సిపల్ అధికారుల ఫిర్యాదుతో చర్యలు

ఆదిభట్ల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లను హైడ్రా అధికారులు తొలగించారు. ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పల్లి, కొంగరకలాన్, బొంగ్లూర్, ఓఆర్ఆర్ సమీపంలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లను మున్సిపల్ అధికారులు గుర్తించి హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దాంతో కొంగరకలాన్, ఓఆర్ఆర్ సమీపంలో ఉన్న హోర్డింగ్‌లను హైడ్రా, ఆదిభట్ల మున్సిపాలిటీ సిబ్బంది కలిసి శనివారం తొలగించారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణను వివరణ కోరగా.. మున్సిపల్ పరిధిలో 80కి పైగా హోర్డింగ్‌లు అనుమతులుండి రెన్యూవల్ చేసుకోవాల్సి ఉన్నాయన్నారు. మరో 9 హోర్డింగ్‌లు ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేయడంతో హైడ్రా అధికారులు తొలగించారన్నారు. పర్మిషన్ లేకుండా హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు.

అలనాటి రాజరిక పాలనకు సాక్షీభూతంగా రాచకొండ ఖిలా నిలుస్తుందని చెప్పవచ్చు. రాచకొండను రాజధానిగా చేసుకుని గొప్ప సామ్రాజ్యాన్ని నిర్మించారు. అలనాడు సింహభూపాలుడు నిర్మించిన కోటగోడ, అంతఃపురం, దేవాలయాలు ఒకటేమిటి సుసంపన్న రాజధానికి ఉండాల్సిన అన్ని హంగులూ ఇప్పటికీ గోచరిస్తాయి. ఇంకా కనుచూపుమేరలో కనిపించే కొండకోనలు, నీటి పరవళ్లు, నిండైన చెట్లు చేమలతో పరుచుకుని పచ్చటి హొయలతో నిండి సహజసిద్ధ పర్యాటక కేంద్రంగా చూసేవారిని కట్టిపడేస్తుంది. రాచకొండ పర్యాటకులు వీక్షించాల్సిన ప్రదేశాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేకం.



రాచకొండ ఖిలా

Sunday Special

రాజదర్పం
రాచకొండ
సహజసిద్ధ పర్యాటక కేంద్రంగా గుర్తింపు

- శత్రుదుర్భేద్యమైన రాతి కోటగోడ
- ఏడు ముఖ ద్వారాలతో కొండపై అంతఃపురం
- అంతుచిక్కని సంకెళ్ల బావి రహస్యం
- నేటికీ భక్తులతో కళకళలాడుతున్న ఆలయాలు
- రాచకొండ పర్యాటకంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేకం



అంతఃపురం ముఖద్వారం

ఇలా చేరుకోవాలి..

హైదరాబాద్ నుంచి రాచకొండ కోటకు చేరుకోవాలంటే నాగార్జున సాగర్ హైవే దగ్గరి దారి. హైదరాబాద్ నుంచి సాగర్ హైవేలో 20 కిలో మీటర్ల వెళ్తే ఇబ్రహీంపట్నం వస్తుంది. ఇక్కడి నుంచి 10 కిలోమీటర్లు ప్రయాణించాక మంచాల మండల కేంద్రం వస్తుంది. ఇక్కడి కరెంటు జంక్షన్ మూలమలుపు తిరిగి 6 కిలోమీటర్ల దూరంలోని తిప్పాయగూడ దాటాలి. అక్కడి నుంచి నేరుగా మరో 2 కిలోమీటర్ల తదుపరి సందర్శకులు రాచకొండ కోటకు చేరుకుంటారు.

మంచాల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): 14వ శతాబ్దంలో రాచకొండ ప్రాంతాన్ని పాలించిన పద్మనాయక వంశానికి చెందిన రేచర్ల సింహభూపాలుడు రాచకొండ కోటను నిర్మించాడు. ఈ సామ్రాజ్యాన్ని మొదటగా కాకతీయులు, పద్మనాయక వంశీయులు, బహమనీ సుల్తానులు, కుతుబ్‌షాహీలు తదుపరి నిజాం నవాబులు పాలించారు. కాగా పద్మనాయక వంశపాలకుల సమయమే రాచకొండకు స్వర్ణయుగమని పిలుస్తారు. అలనాడు సింహభూపాలునిచే నిర్మించబడిన కోటగోడ, అంతఃపురం, దేవాలయాలు ఒకటేమిటి సుసంపన్న రాజధానికి ఉండాల్సిన అన్ని హంగులూ ఇప్పటికీ గోచరిస్తాయి. ఏడు ముఖ ద్వారాలతో కొండపై అంతఃపురం నిర్మించారు. వందల ఎకరాల విస్తీర్ణం కలిగి ఉన్న ఈ అంతఃపురం చుట్టూ రాతితో

మిగతా 7వ పేజీలో...

కోడి పందేల కేసులో నోటీసులు

- నేడు వివరణ ఇవ్వనున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి!

మొయినాబాద్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కోడి పందేల కేసు విచారణలో భాగంగా మొయినాబాద్ మండలం తోలుకట్ట శివారు ఫాంహౌస్ యజమాని, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి ఇచ్చిన నోటీసుకు సంబంధించి వివరణ గడువు నేడు ఆదివారంతో ముగియనుంది. నోటీసు తీసుకున్న 4 రోజుల్లో సమాధానం ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. ఆదివారం శ్రీనివాస్‌రెడ్డి నేరుగా వచ్చి సమాధానం ఇస్తారా? లేదా? అనేది తేలనుంది.

పందేల నిర్వాహకుడిని కస్టడీకి ఇవ్వాలి

ఫాంహౌస్‌లో కోడి పందేలు నిర్వహించిన సూత్రధారి శివకుమార్ వర్మ అలియాస్ రాజు అలియాస్ గబ్బర్‌సింగ్‌ను తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అది వచ్చే సోమవారం విచారణకు రానుంది. కోర్టు అనుమతితో శివకుమార్‌ను తమ కస్టడీకి తీసుకొని విచారిస్తే మరిన్ని విషయాలు తెలిసే అవకాశం ఉంది. ఇక ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న కోళ్లకు సైతం సోమవారంతో విముక్తి లభించనుంది. సోమవారం కోర్టు అనుమతితో పోలీసుల ఆధీనంలో ఫాంహౌస్‌లో ఉన్న కోళ్లను వేలం వేయనున్నట్లు తెలిసింది. అప్పటి వరకు కోళ్లకు, కార్లకు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయాల్సిందే.

రంగరాజన్‌పై దాడి చేసిన నిందితులను శిక్షించాలి

- బాలాజీ ఆలయ మేనేజింగ్ కమిటీ చైర్మన్ సౌందరరాజన్

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): తన కుమారుడు, అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేయడం ఎంతవరకు సబబు అని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని చిలుకూరు బాలాజీ దేవాలయ మేనేజింగ్ కమిటీ చైర్మన్, రంగరాజన్ తండ్రి ఎంవీ సౌందరరాజన్ డిమాండ్ చేశారు. రంగరాజన్‌పై దాడిని ఆసరాగా తీసుకొని ఆలయాన్ని తమ చేతుల్లోకి తీసుకోవాలని గున్నాల వంశీయులు ప్రయత్నాలు చేస్తున్నారని వివరించారు. ఈమేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. నిజాం ప్రభుత్వం హయాంలో హైదరాబాద్ దేవాదాయ, ధర్మదాయ క్రమబద్ధీకరణ నిబంధనల ప్రకారం తమ పూర్వీకులైన దివంగత శఠగోపాలాచారి చిలుకూరు బాలాజీ దేవాలయానికి హక్కుదారుగా ఉన్నారని పేర్కొన్నారు. ఫిబ్రవరి 7న జరిగిన దుర్ఘటన(దాడి) నేపథ్యంలో ఇటీవల గున్నాల కుటుంబానికి చెందిన మల్లారెడ్డి తమపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, ఆలయాన్ని తమ ఆధీనంలోకి తీసుకోవడానికి యత్నిస్తున్నారని, ఆయనపై పరువు నష్టం దావా వేయాలని నిర్ణయం తీసుకున్నట్లు సౌందరరాజన్ పేర్కొన్నారు.



మాట్లాడుతున్న చరణ్ గౌతమ్

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తనీయొద్దు

- డీఆర్‌డీఏ ఏపీడీ చరణ్ గౌతమ్

కేశంపేట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ ఏపీడీ చరణ్ గౌతమ్ సూచించారు. కేశంపేట మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, మిషన్ భగీరథ ఏఈలతో సమావేశం నిర్వహించారు. నీరు వృథా కాకుండా నల్లాలకు ఆన్ ఆఫ్ ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రిడ్ ద్వార నీరు అందనప్పుడు, బోర్ల ద్వారా సరఫరా చేయాలన్నారు. అలాగే ఉపాధి పనులకు కూలీలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ డిప్యూటీ ఈఈ అబ్దుల్ బాద్రి, ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి, ఎంపీవో కిష్టయ్యలు, ఏపీవో అజీజ్ అహ్మద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్

ప్రజలకు శాపంగా కాంగ్రెస్ పాలన

- మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్
- 18న ఆమనగల్లులో రైతుదీక్ష
- హాజరుకానున్న బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కడ్తాల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ 14 నెలల పాలన ప్రజలకు శాపంగా మారిందని, ఆ హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ ఆరోపించారు. మండల కేంద్రంలోని ఆయన నివాసంలో శనివారం కల్వకుర్తి నియోజకవర్గ స్థాయి బీఆర్‌ఎస్ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతీ వర్గాన్ని మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. సర్కార్ వైఫల్యాలు, ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజల పక్షాన పోరాడాలని బీఆర్‌ఎస్ శ్రేణులకు జైపాల్‌యాదవ్ పిలుపునిచ్చారు. రుణమాఫీ, రైతు భరోసా విషయంలో ప్రభుత్వం మాట తప్పి రైతులను మోసగించిందన్నారు. రాష్ట్రంలో రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని కార్యకర్తలంత మరింత ఉత్సాహంగా ముందుకు సాగాలన్నారు. ఈనెల 18న ఆమనగల్లులో నిర్వహించే రైతు దీక్షకు బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు ప్రతిష్టాత్మకంగా తీసుకొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, మాజీ జెడ్పీటీసీలు జర్పుల దశరథ్ నాయక్, విజితారెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహ్మారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ తదితరులు హాజరయ్యారు.

మరో అవకాశం

- కుటుంబ సర్వేలో వివరాల నమోదుకు చాన్స్
- కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ సమగ్ర సర్వేలో గతంలో వివరాలను నమోదు చేసుకోని వారికి ప్రభుత్వ మరో అవకాశం కల్పించిందని కలెక్టర్ సి. నారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఆయన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ ఈనెల 16 నుంచి 28వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా వివరాలను నమోదు చేసుకునే అవకాశం కల్పించినట్లు చెప్పారు. సర్వే జరిగే సమయంలో ఇంటి వద్ద అందుబాటులో లేనివారు ప్రస్తుతం ప్రభుత్వం కల్పిస్తున్న మరో అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజాపాలన కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. అక్కడికి వెళ్లి వివరాలు తెలియజేసి ఫామ్‌లో నమోదు చేసుకోవచ్చని, లేదా ఆన్‌లైన్ ద్వారా ఫామ్ డౌన్‌లోడ్ చేసుకొని తమ కుటుంబ వివరాలను నింపి దగ్గరలోని ప్రజాపాలన కేంద్రాల్లో అందజేయాలని సూచించారు. మూడో పద్ధతి ద్వారా టోల్ ఫ్రీ నెంబర్ 040-21111111కు కాల్ చేస్తే ఆ పరిధిలో ఎన్యుమరేటర్ ఇంటి వద్దకే వచ్చి వివరాలు నమోదు చేసుకుంటారని ఆయన వివరించారు.

తాగునీటి ఎద్దడిని అధిగమించేలా..!
ఉమ్మడి జిల్లాలో ముందస్తు కార్యాచరణ



చేవెళ్లలో కొనసాగుతున్న పైప్‌లైన్ మరమ్మతు పనులు



- నీటి కటకట లేకుండా చూడాలని కలెక్టర్ల ఆదేశం
- ఆర్‌డబ్ల్యుఎస్, మిషన్ భగీరథ అధికారులతో సమీక్షలు
- వేసవికి ముందే పైప్‌లైన్ల మరమ్మతులకు చర్యలు
- నీటి సమస్య ఉన్నచోట బోర్లు, ట్యాంకర్లతో సరఫరా
- తాండూరు కాగ్నా నది నుంచి నీటి సరఫరాకు ప్రణాళికలు

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి రంగారెడ్డి జిల్లా శరవేగంగా విస్తరిస్తోంది. జనాభా తోపాటు నీటి వినియోగం కూడా పెరిగింది. ప్రస్తుతం ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరు ప్రజల అవసరాలకు సరిపోవడం లేదు. రాబోయే వేసవిలో ఈ సమస్య మరింత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో తాగునీటి సమస్య పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఆర్‌డబ్ల్యుఎస్, మిషన్ భగీరథ అధికారులతో కలెక్టర్లు సమీక్షలు నిర్వహిస్తున్నారు. నీటి కటకట ఏర్పడకుండా సలహాలు, సూచనలు ఇస్తున్నారు. పైప్‌లైన్ లీకేజీల మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. నీటి సమస్య అధికంగా ఉన్నచోట బోర్లు, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఉమ్మడి జిల్లాలో...

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 28 మున్సిపాలిటీలు, 8 మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో 15 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లు ఉండగా వికారాబాద్ జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలున్నాయి. అలాగే మేడ్చల్ జిల్లాలో 9 మున్సిపాలిటీలు,

మిగతా 7వ పేజీలో...

• కల్యాణం.. కమనీయం



108 దివ్య దేశాల పెరుమాళ్లకు కల్యాణం జరిపిస్తున్న చిన జీయర్‌స్వామి

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ముచ్చింతల్ సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో సమతా కుంభ్ తృతీయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ప్రముఖ ఆధ్యాత్మిక గురువు చిన జీయర్‌స్వామి పర్యవేక్షణలో 108 దివ్య క్షేత్రాల పెరుమాళ్లకు శాంతి కల్యాణోత్సవం శనివారం కనుల పండవగా జరిగింది. ఈ వేడుకకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో అహోబిల జీయర్‌స్వామి, దేవనాథ జీయర్‌స్వామి, మైహోం గ్రూప్ అధినేత జూపల్లి రామేశ్వర్ రావు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

• సంత్ సేవాలాల్ సేవలు అసామాన్యం

బంజార, లంబాడాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. గిరిజన ప్రజా ప్రతినిధులు, నాయకులు, యువకులు ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని సేవాలాల్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే సేవాలాల్ ఘాట్‌ల వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం చేపట్టిన శోభాయాత్రలో గిరిజన మహిళలు, యువతీ యువకులు చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా సేవాలాల్ చేసిన సేవలు అసామాన్యమని పలువురు కొనియాడారు.



సేవాలాల్ జయంతి సందర్భంగా కడ్తాలలో గిరిజన నేతల ర్యాలీ

గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట



సేవాలాల్ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్

పెద్దేముల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): తండాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక్కో నియోజకవర్గానికి రూ.10కోట్లు మంజూరు చేశారని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తెలిపారు. జయరాంతండాలో సంత్ సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ ఉత్సవాలకు ఎమ్మెల్యేతో పాటు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బంజారాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారన్నారు. త్వరలోనే తాండూరులో బంజారా భవన్‌ను అందుబాటులోకి తెస్తామని తెలిపారు. దీనికి మరో ఎకరం భూమిని సమకూర్చాలని గిరిజన నాయకులు ధారాసింగ్ కోరారని, అందుకు ఎకరం భూమిని బంజారా భవన్‌కు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. యువత సేవాలాల్ మార్గాన్ని అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధానకార్యదర్శి ధారాసింగ్, ఏఎంసీ ఛైర్మన్ అంజయ్య, వైస్‌ఛైర్మన్ నారాయణరెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు శోభారాణి, ఎ-బ్లాక్ అధ్యక్షులు నర్సిములు, జితేందర్‌రెడ్డి, రియాజ్, బాబుసింగ్ పాల్గొన్నారు.

ఘనంగా శివాలయ పునః ప్రతిష్ఠాపన

● పూజల్లో పాల్గొన్న కర్ణాటక రాష్ట్ర మంత్రి శరణ్‌ప్రకాశ్ పాటిల్



శివాలయ ప్రతిష్ఠాపన పూజల్లో గ్రామస్థులు, ప్రజా ప్రతినిధులు

దౌల్తాబాద్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోకఫస్లాబాద్‌లో శివాలయం పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో వివిధ గ్రామాల ప్రజలు, నాయకులు పాల్గొన్నారు. కలశం, శివలింగంతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. శివలింగానికి అభిషేకం, పూజలు చేశారు. పూజా కార్యక్రమాలతో గోకఫస్లాబాద్ యావత్తు శివనామస్మరణతో మార్మోగింది.



పూజల్లో పాల్గొన్న కర్ణాటక రాష్ట్ర మంత్రి శరణ్‌ప్రకాశ్ పాటిల్

కోటి రూపాయలతో నిర్మించిన శివాలయం పునఃప్రతిష్ఠాపన పూజల్లో కర్ణాటక రాష్ట్ర విద్యాశాఖ మంత్రి శరణ్‌ప్రకాశ్‌పాటిల్ పాల్గొన్నారు. మంత్రిని ఆలయ కమిటీ నిర్వాహకులు శాలువాతో సత్కరించారు.

గ్రీన్ ఇండియా చాలెంజ్ కో-ఆర్డినేటర్‌గా రాజశేఖర్



షాద్‌నగర్ అర్బన్ ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఇండియా చాలెంజ్ షాద్‌నగర్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్‌గా షాద్‌నగర్‌కు చెందిన తమగొండ రాజశేఖర్‌ను నియామకయ్యారు. ఈ మేరకు గ్రీన్ ఇండియా చాలెంజ్ వ్యవస్థాపకుడు జోగినపల్లి సంతోష్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. షాద్‌నగర్ ప్రాంతంలో పచ్చదనాన్ని పెంచే సామాజిక బాధ్యతను అప్పగించడం అనందంగా ఉందని రాజశేఖర్ తెలిపారు. సంతోష్, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ధర్మబిక్షం జయంతి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీపీఐ నేత, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మబిక్షం 103వ జయంతిని శనివారం ఇబ్రహీంపట్నంలో ఘనంగా నిర్వహించారు. గీత పనివారల సంఘం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.రాములు గౌడ్, డి.యాదయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ధర్మబిక్షం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గీత పనివారల సంఘం నాయకులు

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

తలకొండపల్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): తలకొండపల్లి మండలం చెన్నారంలోని మల్లప్పగుట్టపై గల ప్రసిద్ధ మల్లికార్జునస్వామి ఆలయంలో ఈ నెల 22 నుంచి 28 వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఉత్సవాలకు రావాలని శనివారం అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్‌కు ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానపత్రిక అందజేశారు. హైదరాబాద్‌లోని స్పీకర్ నివాసంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు ఏమిరెడ్డి పాండురంగారెడ్డి, కమిటీ మెంబర్లు కల్లు పెంటారెడ్డి, శేఖర్ రెడ్డి, దామోదర్‌రెడ్డిలు స్పీకర్‌ను శాలువాలతో సత్కరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 26న నిర్వహించే స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొనాలని ప్రసాద్‌కుమార్‌ను కోరారు. ఆలయ చరిత్ర, భక్తులకు కల్పించిన వసతులపై స్పీకర్‌కు వివరించినట్లు వారు పేర్కొన్నారు. గుట్టపై అద్భుత శిలాసంపదతో ఆలయాన్ని నిర్మించిన నిర్వాహకులను ప్రసాద్‌కుమార్ అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మ్యాకం పాండు, కార్యదర్శి మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు



స్పెక్ ఫెస్టా-2025 లో పాల్గొన్న ప్రతినిధులు

ప్రతీ విద్యార్థి ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదగాలి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సాంకేతిక రంగంలో రాణించదల్చిన విద్యార్థులు ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదగాలని ఐబీఎం డెలివరీ ప్రాజెక్ట్ మేనేజర్ సుకన్తో మహంతి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన స్పెక్ ఫెస్టా-2025 ఎంటర్‌ప్రెన్యూర్‌ను ఆయన ప్రారంభించి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. సాంకేతిక రంగం దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీలో విద్యార్థులు పట్టు సాధించాలన్నారు. సైబర్ సెక్యూరిటీ ఐఓటీ, బ్లాక్‌చైన్, డేటాసైన్స్ సబ్జెక్టుల్లో చోటుచేసుకుంటున్న మార్పులపై ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలను విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలేజి సెక్రటరీ టీవీ.రెడ్డి, ప్రిన్సిపాల్ కె.శ్రీలత, అకడమిక్ డైరెక్టర్ సరోజరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్‌రెడ్డి, పీఆర్వో రవిసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాజదర్పం రాచకొండ

(ఐదో పేజీ తరువాయి)

కట్టబడిన శత్రుదుర్భేద్యమైన కోటగోడ ఉంది. ఈ ప్రహరీ మొత్తం రాతితో నిర్మించబడి ఉండడం విశేషం. ఒక్కో ముఖఃద్వారం పరిధిలో ప్రత్యేక నిర్మాణాలు, కొలనులు ఉంటాయి. అంతఃపురం చుట్టూ వేలాది ఎకరాల్లో నిర్మాణాలు, గుళ్ల గోపురాలు నిర్మించబడి ఉన్నాయి. సుమారు 900 ఏళ్ల క్రితం నిర్మించబడ్డ ఈ దేవాలయాలు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉండడం గమనార్హం.

సంకెళ్లబావిలో నిధినిక్షేపాలు

రాచకొండ కోట అంతఃపురం ఏడు ముఖఃద్వారాల్లో చివరి ముఖఃద్వారం దాటగానే సంకెళ్లబావి ఉంటుంది. ఈ సంకెళ్లబావికి ప్రత్యేకత ఉంది. అంత ఎత్తైన ప్రదేశంలోనూ ఈ బావిలో నీటి నిల్వలు ఉండడం విశేషం. పైగా ఈ బావి లోతు అంతు చిక్కనిదిగా ఉంటుందని చరిత్రకారులు చెబుతున్నారు. ఆనాటి రాజులు తమ నిధి నిక్షేపాలను ఈ బావిలోనే దాచి ఉంచేవారని ప్రసిద్ధి. ఇంకా ఈ బావి నుంచి సొరంగమార్గం తంగెడిపల్లి చెరువుదాకా విస్తరించి ఉంటుందని ప్రచారంలో ఉంది. కొండ కింది భాగంలో స్వయంభు శంభులింగేశ్వరాలయం ఉంటుంది. దేశంలో మరెక్కడా లేని పరిమాణంలో ఉన్న ఈ శివలింగానికి ప్రత్యేకత ఉంది. ఏటా శివరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు అనేక ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేస్తారు.




కొండ కిందిభాగంలో గల స్వయంభూ శంభులింగేశ్వరస్వామి



సెలయేరు

లక్ష్మీనృసింహస్వామి ఆలయం.. ప్రత్యేకం

రాచకొండ అంతఃపురం కోటలో ఏడు ముఖఃద్వారాలతో ఒక భాగం కాగా లక్ష్మీనృసింహ స్వామి ఆలయం ఉండే ప్రదేశం మరో భాగం. దీనినే గుర్రాల గుట్టగా పిలుస్తారు. ఈ ప్రదేశం సుమారు వందకు పైగా ఎకరాల్లో విస్తరించి ఉంటుంది. కొండపైనే ఐదు దశాబ్దాలు దాటినా చెక్కుచెదరని రీతిలో రాతితో నిర్మించబడిన నరసింహస్వామి ఆలయం ఉంటుంది. గుడి సమీపంలోనే గుర్రాలు సేదదీరేందుకు నిర్మించిన పెద్ద కొలను ఉంటుంది. అప్పట్లో ఈ గుర్రాల గుట్ట సైనికుల విడిదిగా కూడా ఉండేదని చెబుతారు.



గుర్రాల గుట్టపై గల నరసింహస్వామి ఆలయం

సేదతీరే బోగని మంచం

రాచకొండ కోట కింది భాగంలో అంతఃపురానికి విస్తరించి ప్రజలు నివసించేందుకు ఏర్పాటుచేయబడ్డ అనేక గ్రామాలు ఉంటాయి. అప్పట్లో ప్రజల నివాసం కోసం రాతితో నిర్మించబడిన ఇళ్లు, తాగునీటి బావులు, వంటకోసం వినియోగించే రాతి రోళ్లు తదితరాలన్నీ ఈ ప్రాంతంలో ఇప్పటికీ కనిపిస్తాయి. రాచకొండ కోట, ప్రజల నివాసం సముదాయాల మధ్య నుంచి వాగునీటి సెలయేరు ఎల్లప్పుడూ పారుతూనే ఉంటుంది. ఈ వాగుకు అనుసరించే వర్షాకాలంలో కొండలపైనుంచి జలపాతాలు సందర్శకులను కనువిందు చేస్తాయి. ప్రజావాసాల పక్కనే వీరభద్రేశ్వరస్వామి ఆలయంతో పాటు మరిన్ని దేవతామూర్తుల ఆలయాలు ఉంటాయి. ఇప్పటికీ కుటుంబాలతో సహా భక్తులు ఈ ఆలయానికి చేరుకుని వీరభద్రస్వామికి మొక్కులు తీర్చుకుంటారు. ఇదీగాక రాచకొండ కోటకు దక్షిణ ప్రాంతంలో ఉండే గుట్టపై బోగని మంచం అనే రాతి కట్టడం ఉంటుంది. రాజులు అప్పట్లో ఈ బోగని మంచానికి చేరుకుని సేదతీరి వెళ్లేవారని చరిత్రకారులు చెబుతారు.

బిల్లులియ్యకుంటే తాళం వేస్తా!

▸ 'ఆదర్శ' పాఠశాల వద్ద ఘటన

పెద్దేముల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులు చేసి నెలలు గడుస్తున్నా ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదని ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ భర్త పాఠశాలకు తాళం వేసేందుకు యత్నించిన ఘటన బుద్ధారం పాఠశాలలో చోటుచేసుకుంది. పాఠశాలలో వసతులు కల్పించే పనులు చేయించాలని ఆదర్శకమిటీ చైర్‌పర్సన్ స్వరూపకు అధికారులు సూచించారు. ఈ మేరకు ఆమె భర్త శ్రీనివాస్ రూ.2లక్షలు వెచ్చించి మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ వైరింగ్ పనులు చేయించారు. అయితే వాటికి నేటికీ బిల్లు రాలేదని శనివారం పాఠశాలకు తాళం వేసేందుకు వెళ్లాడు. పాఠశాలకు తాళం వేస్తానని అక్కడున్న టీచర్‌కు చెప్పడంతో ఆమె పైఅధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అధికారులు శ్రీనివాస్‌తో ఫోన్లో మాట్లాడి అలాంటి పనిచేయొద్దని సూచించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలోనే బిల్లులు చెల్లించేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో శ్రీనివాస్ అక్కడి నుంచి వెళ్లిపోయారు.



బుద్ధారంలో పాఠశాలకు తాళం వేసేందుకు వచ్చిన శ్రీనివాస్

హోటళ్లపై కమిషనర్ దాడులు

▸ అపరిశుభ్ర వంటకాలు ఉండడంతో జరిమానా

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి మున్సిపాలిటీలో హోటళ్లు, బేకరీలపై మున్సిపల్ కమిషనర్ యోగేష్ శనివారం దాడులు నిర్వహించారు. పౌల్ట్రీ కోళ్లకు బర్డ్‌ఫ్లూ వైరస్ సోకుతున్న నేపథ్యంలో హోటళ్లు, బేకరీలు, మెస్‌లలో శుభ్రమైన చికెన్ వాడుతున్నారా? లేదా? అని మున్సిపల్ అధికారులు దాడులు చేపడుతున్నారు. పట్టణంలోని ఏడు హోటళ్లు, బేకరీల్లో కమిషనర్ తనిఖీ చేశారు. మసుల్దార్ మండి, పల్లె రుచులు, ఎస్వీఆర్ బేకర్స్ అండ్ హోటళ్లలో పాడైన చికెన్, అల్లం పేస్ట్, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను పడేశారు. వంట గదులు అపరిశుభ్రంగా ఉండటంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మసుల్దార్ మండి హోటల్‌కు రూ.30వేలు, పల్లెరుచులు హోటల్‌కు రూ.5వేలు, ఎస్వీఆర్ బేకరీకి రూ.5వేల చొప్పున జరిమానా విధించారు. వారం రోజుల్లో తనిఖీకి వస్తానని, పద్ధతి మారకుంటే హోటళ్ల లైసెన్స్ రద్దు చేసి సీజ్ చేస్తానని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకోవద్దని సూచించారు. ఆయన వెంట ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ ఆనంద్, వార్డు అధికారులు, శానిటేషన్ జవాన్లు, బిల్ కలెక్టర్లు ఉన్నారు.



ఎస్వీఆర్ బేకరీ యజమానికి జరిమానా విధిస్తున్న కమిషనర్ యోగేష్



హైదరాబాద్‌లో ఎమ్మెల్యే సాంబశివరావుకు వినతిపత్రం ఇస్తున్న భూదాన్ రైతులు

భూదాన్ భూములు దక్కేలా సీఎంతో మాట్లాడుతా

▸ రైతులకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హామీ

నందిగామ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): భూదాన్ భూములను కోల్పోయిన రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. శనివారం భూదాన్ రైతులు హైదరాబాద్‌లోని నవచేతన విజ్ఞాన సమితి కార్యాలయంలో ఎమ్మెల్యేను కలసి వినతిపత్రం ఇచ్చారు. నందిగామలో 18 మంది పేద రైతులకు 1975లో 99 ఎకరాల భూమిలో భూదాన్ బోర్డు పట్టాలు ఇచ్చిందని, ఆ భూమికి కొందరు తప్పుడు ఆర్వోఆర్‌లు సృష్టించి కబ్జా చేశారని రైతులు వాపోయారు. రైతులకు న్యాయం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడుతానని, నిరుపేదలకు న్యాయం జరిగే వరకు అండగా ఉండి పోరాడుతామని ఎమ్మెల్యే వారికి భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సీపీఐ నాయకులు రవీంద్రచారి, పర్వతాలు, జంగయ్య, రామస్వామి, శేఖర్‌రెడ్డి, రైతులు శ్రీనివాస్, జంగయ్య, పోచయ్య ప్రవీణ్, రాజు, చంటి ఉన్నారు.

నేటి నుంచి కొనగట్టు శివాలయ జాతర



చేవెళ్ల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు చేవెళ్లలోని కొనగట్టు శివాలయ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ సున్నపు వసంతం తెలిపారు. శనివారం చేవెళ్లలో విలేకర్లతో మాట్లాడుతూ.. చేవెళ్లలో కొలువైన కొనగట్టు శివాలయంలోని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వారి బ్రహ్మోత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహిస్తామని తెలిపారు. 16న గణపతి హోమం, అఖండ దీపారాధన, 17న పునః పూజ, రుద్రాభిషేకం, బిల్వార్చన, అమ్మవారికి సహస్ర పుష్పార్చన, 18న రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, అలాగే మూడు రోజుల పాటు హోమాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు.

గ్యారెంటీలను అమలు చేయాలి

చేవెళ్ల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు న్యాలట అశోక్ అన్నారు. ఈ నెల 20న హైదరాబాద్‌లో నిర్వహించే సభపోస్టర్‌ను శనివారం చేవెళ్లలో సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. సభకు రైతులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో బాల్‌రెడ్డి, కృష్ణాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రయ్య జంగయ్య, రాఘవేందర్‌రెడ్డి, రామయ్య, శేఖర్, దశరథ్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని అధిగమించేలా..!

(5వ పేజీ తరువాయి)

5 కార్పొరేషన్లు ఉన్నాయి. వికారాబాద్ జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలున్నాయి. 30 వేల జనాభా ఉన్న పరిగి మునిసిపల్ ప్రజలకు రోజూ 3.61 ఎంఎల్‌డీ నీరు అవసరం కాగా, మిషన్ భగీరథ ద్వారా 1.67 ఎంఎల్‌డీ మాత్రమే నీటి సరఫరా జరుగుతోంది. మునిసిపల్ పరిధిలోని 72 బోర్ల ద్వారా ఒక ఎంఎల్‌డీ నీరు సరఫరా అవుతోంది. ఒక ఎంఎల్‌డీ నీటి కొరత ఉంది. పరిగి పట్టణంలో ఏర్పాటైన కొత్త కాలనీలకు మిషన్ భగీరథ నీటి సరఫరా లేదు. భవానీనగర్, తిరుమల రెసిడెన్సీ, మైత్రినగర్, శ్రీనివాస హిల్స్, వేంకటేశ్వర, ఆర్టీసీ, ఎస్ఆర్ఐ, తుంకులగడ్డ కాలనీలకు నల్లా కనెక్షన్లతో నీటి సరఫరా కొనసాగడం లేదు. వికారాబాద్, కొడంగల్ మునిసిపల్ పరిధిలో ఇంకా తాగునీటి ఇబ్బందులు ప్రారంభం కాలేదు. వికారాబాద్ పట్టణ ప్రజలకు రోజూ మిషన్ భగీరథ ద్వారా 13 ఎంఎల్‌డీ నీటి సరఫరా జరగాల్సి ఉండగా, ప్రస్తుతం 10 ఎంఎల్‌డీ నీరు సరఫరా అవుతోంది. మున్సిపల్ అధికారులు రోజు విడిచి రోజు నీటి సరఫరా చేస్తున్నారు. వికారాబాద్ పట్టణ ప్రజలకు ఇంతకు ముందు తాగునీటిని అందించిన శివసాగర్‌లో పూర్తి స్థాయిలో నీరు అందుబాటులో ఉంది. తాగునీటి సమస్య ఎదురైతే శివసాగర్ నుంచి నీటిని సరఫరా చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు పైపులైన్లలో మరమ్మతులకు గురైన ఒక పైపులైన్ మరో వారం రోజుల్లో అందుబాటులోకి రానుంది. ముందు జాగ్రత్తగా 4 వాటర్ ట్యాంకర్లు అందుబాటులో ఉంచారు. అవసరమైతే ఆయా వార్డుల్లోని బోర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నారు. వికారాబాద్ జిల్లాలో 10700 నీటి కనెక్షన్లు ఉన్నాయి. అమృత్ 2.0లో భాగంగా వికారాబాద్ పట్టణంలో రామయ్యగూడ, భృంగీ కాలనీల్లో కొత్త మంచినీటి ట్యాంకుల నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. వచ్చే వేసవి నాటికి ఈ ట్యాంకులను అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కొడంగల్ మున్సిపాలిటీల్లో తాగునీటి ఎద్దడి లేదు. రోజుకు 1.84 ఎంఎల్‌డీ నీరు అవసరం కాగా, ప్రస్తుతం 1.8 ఎంఎల్‌డీ నీటి సరఫరా జరుగుతోంది. మిషన్ భగీరథ నీటి సరఫరా ఏ కారణం వల్లనైనా ఆగిపోతే ప్రత్యామ్నాయంగా బోర్ల ద్వారా తాగునీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు మునిసిపల్ అధికారులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో ఒకవేళ తాగునీటి సమస్య తీవ్రతరం దాలిస్తే మాత్రం తాండూరు కాగ్నా నది నుంచి నీటిని సరఫరా చేసే విధంగా మునిసిపల్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు.

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మున్సిపాలిటీకి మిషన్ భగీరథ ద్వారా నీరు సరఫరా అవుతుంది. పట్టణానికి నీటి తలసరి వినియోగం 1.8 ఎంఎల్‌డీ (18లక్షల లీటర్లు) ఉండగా 1.5 ఎంఎల్‌డీ (15లక్షల లీటర్లు) నిత్యం సరఫరా అవుతుంది. జనాభా పెరగడంతో 0.3 ఎంఎల్‌డీ నీటి సరఫరా అవసరం ఉందని మున్సిపల్ అధికారులు కోరినా మిషన్ భగీరథ అధికారులు నీటిని పెంచడం లేదు. దీని దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ అధికారులు బోర్లు, ట్యాంకుల ద్వారా పట్టణ ప్రజలకు నీటిని సరఫరా చేస్తున్నారు. వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని అధికారులు మంజీరా నీటిని సరఫరా చేయాలని శంకర్‌పల్లి పట్టణవాసులు కోరుతున్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 50వేల వరకు జనాభా ఉంది. రోజుకు 5ఎంఎల్‌డి నీరు అవసరం కాగా మిషన్ భగీరథ ద్వారా 4.45 ఎంఎల్‌డీ నీరు సరఫరా చేస్తున్నారు. రోజు విడిచి రోజు నీటిని అందిస్తున్నారు. 105 బోర్లు కూడా ఉన్నాయి. ఆమనగల్లు మున్సిపాలిటీ జనాభాకు ప్రతి రోజు2.5 మిలియన్ లీటర్ల నీరు అవసరం ఉంది. మిషన్ భగీరథతో 2మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. మరింత మున్సిపాలిటీకి చెందిన 30బోర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం నీటి సమస్య లేదు. ఉష్ణోగ్రతలు పెరుగుతుండటతో తాగునీటి డిమాండ్ పెరుగుతోంది. గతేడాది ఇదే సమయంలో ఇంతగా డిమాండ్ లేదని అధికారులు చెబుతున్నారు. రోజు విడచి రోజు నీటిని సరఫరా చేస్తున్నారు. కొన్ని చోట్ల పైపులైన్లు సరిగా లేక పోవడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ మున్సిపాలిటీలో 3.43 మిలియన్ లీటర్ల నీరు అవసరం కాగా ఇందులో హెచ్ఎం డబ్ల్యు ద్వారా 2.5 మిలియన్ లీటర్లు, మిషన్ భగీరథ ద్వారా 0.53 మిలలియన్ లీటర్లు సరఫరా చేస్తున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటి సమస్య రాకుండా మున్సిపల్ అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. ఆదిభట్ల మున్సిపాలిటీలో 25 వేల జనాభాకు రోజుకు ఎంఎల్‌డి నీటిని సరఫరా చేస్తున్నారు. నిత్యం నీటిని సరఫరా చేస్తున్నారు. ట్యాంకర్లు కూడా అందుబాటులో ఉన్నాయి. 110 బోర్లు పనిచేస్తున్నాయి. చేవెళ్ల మున్సిపాలిటీల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతుంది. 2,322 లక్షల లీటర్లు సరఫరా చేస్తున్నారు. శంషాబాద్ మున్సిపాలిటిలలో 4 మిలియన్ లీటర్ల నీరు సరఫరా అవుతుంది. నీటి సమస్య ఇంకా తలెత్తలేదు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో 4.5 మిలియన్ లీటర్ల నీరు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం నాలుగు వాటర్ ట్యాంకర్లు ఉండగా అదనంగా మరో 8 వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేశారు. ఆరు ఓవర్ హెడ్ పంపులు ఉన్నాయి. వేసవి గడిచేంత వరకుప్రత్యేకంగా మంచినీరు సరఫరా కోసం 17 మంది సిబ్బందిని నియమించారు. రోజు తప్పించి రోజు నీరు సరఫరా చేస్తున్నారు. ఒక ఓవర్‌హెడ్ ట్యాంకు, 40 బోర్లను సిద్ధం చేశారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో 3.7 మిలియన్ లీటర్ల నీటి సరఫరా చేస్తున్నారు. 26 బోర్లు సిద్ధంగా ఉన్నాయి. ఎనమిది ట్యాంకులు, రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులను సిద్ధం చేశారు.


తలకొండపల్లిలో.. నిర్వహిస్తున్న బైక్ ర్యాలీ


కడ్తాల్: నృత్యాలు చేస్తున్న గిరిజన మహిళలు


షాద్‌నగర్ అర్బన్: పూజల్లో ఎమ్మెల్యే శంకర్


యాచారం: తక్కళ్లపల్లి తండాలో..

సేవాలాల్ ఆశయాలు కొనసాగిద్దాం

బంజారాలకు బతుకు దారి చూపిన మహోన్నతమైన వ్యక్తి సంత్ సేవాలాల్ అని వక్తలు కొనియాడారు. శనివారం ఆయన జయంతి సందర్భంగా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చూపిన దారి అందరికీ ఆదర్శనీయమన్నారు. యువత ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు.


శంకర్‌పల్లిలో..


కందుకూరు: గుమ్మడవెల్లిలో..


కేశంపేట: జయంతి ఉత్సవంలో..


చౌదరిగూడ: ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు


నందిగామ: చాకలిగుట్ట తండాలో..


మహేశ్వరం: హాజరైన మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, దేప భాస్కర్‌రెడ్డి


ఆమనగల్లు: నివాళులర్పిస్తూ...

మహనీయుడు సంత్ సేవాలాల్


సేవాలాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

షాబాద్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గిరిజనుల ఆరాధ్య గురువు సంత్ సేవాలాల్ జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శనివారం పోతుగల్‌తండా, రాంసింగ్ తండాలో ఆయన జయంతిని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్ రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్‌లతో కలిసి ఆయన ఘనంగా జరుపుకొన్నారు. గిరిజనుల సమాజానికి ఎనలేని సేవ చేయడం వల్ల ఆయన గొప్ప వ్యక్తి అయ్యారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, మాజీ సర్పంచ్‌లు జనార్దన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రవీందర్‌నాయక్, నాయకులు పీసరి వెంకట్‌రెడ్డి, రాహుల్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి


వెంకటేష్‌కు నియామకపత్రం అందజేస్తున్న లక్ష్మారెడ్డి

కందుకూరు,ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్సీల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేసినట్లు మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఎస్సీ సెల్ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం రూ.6లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

చైర్మన్‌గా వెంకటేష్ నియామకం

మండలంలోని బాచుపల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు కత్తుల వెంకటేష్ ఎస్సీ విభాగం మండల చైర్మన్‌గా నియమితులయ్యారు. మాజీ జెడ్పీటీసీలు ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డిల సమక్షంలో మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిప్రీతం, ఎస్సీ కార్పొరేషన్ జిల్లా చైర్మన్ పంది పెంటయ్యలు .. ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడారు. తనపై నమ్మకంతో మండల ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్‌గా నియమించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, అందుగుల సత్యనారాయణ, ఎస్ కృష్ణానాయక్, కె.శ్రీధర్ పాల్గొన్నారు.

పనితీరుతోనే గుర్తింపు

కడ్తాల్ , ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పనితీరును బట్టే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్‌నాయక్ , డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, బీఆర్ఎస్ అధ్యక్షుడు కడారి రామకృష్ణలు అన్నారు. ఉద్యోగులు విధులు అంకిత భావం, నీతినిజాయితీతో నిర్వర్తించి పనిచేసే చోట ప్రజల అభిమానం చూరగొనాలన్నారు. కడ్తాల్ పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్‌గా నాలుగున్నరేళ్లపాటు సేవలందించి మెగా డెయిరీకి బదిలీ అయిన రాధికకు శనివారం పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. పూలమాలలు, శాలువాలతో ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో డీడీ శివాల్కర్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, రామచంద్రయ్య, రాములు, రమేశ్, నాగార్జున తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం


దేవాలయం నిర్మాణానికి విరాళం అందిస్తున్న వైభవ్‌రెడ్డి

చేవెళ్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : దేవాలయం అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బీజేపీ జిల్లా యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి తెలిపారు. శనివారం చేవెళ్ల మండలం తంగడ్‌పల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి దేవాలయం నిర్మాణంకు రూ. లక్ష నగదును నిర్వాహకులకు అందించారు. అలాగే కిష్టపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయం నిర్మాణానికి మండల బీజేపీ అధ్యక్షుడు అనంతరెడ్డి రూ. 50 వేలను అందించారు. దేవాలయం నిర్మాణంలో తన వంతుగా విరాళం అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ చేవెళ్ల మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి, జిల్లా నాయకులు ఇంద్రసేనారెడ్డి, విక్రమ్‌రెడ్డి, భార్గవ్, సందీప్, శ్రీకాంత్‌రెడ్డి, అఖిల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, త్రినేత్ర, ఎం. మచ్చేందర్‌రెడ్డి, నిర్వాహకులు తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్యలు రావొద్దు

మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ


మాట్లాడుతున్న కమిషనర్ బాలకృష్ణ

ఆదిభట్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో తాగునీరు సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని ఆదిభట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ పేర్కొన్నారు. రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు శనివారం మున్సిపాలిటీ కార్యాలయంలో సంబంధిత అధికారులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. రానున్న వేసవిలో మున్సిపాలిటీలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీ ఇంటిలో నీరు వృథా కాకుండా నల్లాలకు ఆన్ ఆఫ్ బటన్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వార్డులలో బోర్ వెల్‌లు ఒకవేళ రిపేర్లు ఉంటే తక్షణమే బాగు చేయాలన్నారు. నీటి సరఫరాలో ఏవైనా సమస్యలు ఉన్నా వెంటనే సంబంధిత అధికారులు వెళ్లి పరిష్కరించాలన్నారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న ఏరియాలలో అవసరమైతే వాటర్ ట్యాంకర్‌లతో సమస్యను తీర్చాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ స్వర్ణకుమార్, మిషన్ భగీరథ ఈఈ వినయ్‌కుమార్, హెచ్ఎండబ్ల్యూఎస్ మేనేజర్ నిర్మల, వాటర్ సప్లై సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ నీటిబొట్టును పొదుపుగా వాడుకోవాలి

షాబాద్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రతీనీటి బొట్టును పొదుపుగా వాడుకోవాలని ఎంపీడీవో అపర్ణ అన్నారు. శనివారం తన కార్యాలయంలోని సమావేశ మందిరంలో తాగునీటి సమస్యలు, వచ్చే వేసవిలో ప్రణాళికలపై పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులతో కలిసి ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామాల్లో మిషన్‌భగీరథ నీటిని వాడే కుటుంబాలు తప్పనిసరిగా నల్లాలకు ఆన్, ఆఫ్ బటన్ ఉంటే విధంగా చూసుకోవడం ద్వారా నీటిని పొదుపు చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల గ్రిడ్ డీఈ వెంకటేశ్వర్లు, ఎంపీవో శ్రీనివాస్, మిషన్‌భగీరథ ఏఈ చంద్రమోహన్, గ్రిడ్ ఏఈ ప్రఫుల్‌కుమార్, విద్యుత్ శాఖ ఏఈ కోటేశ్వర్‌రావు, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి వృథాను అరికట్టాల్సిందే

మంచాల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రత దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తాగునీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని మంచాల ఎంపీడీవో బాలశంకర్ అధికారులను ఆదేశించారు. శనివారం తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో ఉమారాణి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాజు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

చౌదరిగూడ,ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): వేసవి రాక ముందే గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జయశ్రీ అన్నారు. శనివారం కొందుర్గు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఎంపీవో లాలయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు తయారు చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గత ఏడాది శ్రీరంగాపూర్, అయోధ్యపూర్ తండాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తిందన్నారు. ఈఏడాది ఆ తరహా సమస్యలు ఏ గ్రామంలోనూ రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో నర్సింగ్ రావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీల ఆత్మగౌరవ సభకు తరలిరండి

మొయినాబాద్: ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపీల ఆత్మగౌరవ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆర్ఎంపీ, పీఎంపీల ఐక్యవేదిక ప్రతినిధులు సంతోష్‌కుమార్, మహిపాల్ పేర్కొన్నారు. శనివారం మొయినాబాద్‌లో ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. తమపై జరుగుతున్న దాడులను అరికట్టాలని పేర్కొన్నారు. అనేక డిమాండ్లతో సభను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని ఆర్ఎంపీ, పీఎంపీలు భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా రుద్ర హోమం


రుద్ర హోమం చేస్తున్న భక్తులు

ఆమనగల్లు , ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప కొండ వద్ద గల భవానీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శనివారం రుద్ర హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ తృతీయ వార్షికోత్సవాలలో భాగంగా నిర్వహించిన హోమంలో భక్తులు , శివ స్వాములు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకుడు రేగట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాలు కల్పించారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం నిర్వహించే స్వామి వారి కల్యాణానికి భారీ ఏర్పాట్లు చేశారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ


దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఏసీపీ రాజు

ఇబ్రహీం పట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఏసీపీ కేపీవీ రాజు .. ముగ్గురు దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు. ఆయన ఈ ప్రాంతంలో బాధ్యతలు చేపట్టి ఏడాది గడుస్తున్న సందర్భంగా శనివారం దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాల్ల జంగయ్య తదితరులు ఉన్నారు.

సీఎం వ్యాఖ్యలు సరికాదు


మాట్లాడుతున్న ఆచారి

ఆమనగల్లు , ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి అన్నారు. సీఎం హోదాలో ఉండి మోదీపై అవాకులు, చెవాకులు పేల్చడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఆమనగల్లులో శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ దేశంలోని అన్నివర్గాల అభ్యున్నతికి చిత్తశుద్ధితో ప్రధాని మోదీ పనిచేస్తున్నారని అన్నారు.

సృజనాత్మకంగా ఆలోచించాలి

కందుకూరు,ఫిబ్రవరి 15,(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, సృజనాత్మకంగా ఆలోచించాలని, విద్య, క్రీడారంగాల్లో నైపుణ్యం గల వారి ప్రోత్సాహం అందిస్తామని ల్యాబ్ ఇన్ఫర్ మెటిక్ సాఫ్ట్ వేర్ సంస్థ డైరెక్టర్ రాజశేఖర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు బ్యాగులు, పరీక్ష సామగ్రిని తమ సంస్థ ప్రతినిధులతో కలిసి ఆయన అందజేశారు. సంస్థ ద్వారా ఇప్పటి వరకు రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించామని గుర్తు చేశారు. భవిష్యత్‌లో పోటీ విపరీతంగా ఉంటుందని, దానికి అనుగుణంగా విద్యార్థులు ఇప్పటి నుంచే సిద్ధం కావాలన్నారు. సంస్థ ప్రొఫెసర్ డాక్టర్ జగన్ ప్రసంగించారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోండి

యాచారం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్లను ఆదుకోని పక్షంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడుతామని, మహిళలకు ఉచిత బస్ సౌకర్యం వల్ల ఉపాధి లేకుండా పోయిందని సీపీఎం యాచారం మండల నాయకులు చందూనాయక్, పీ బ్రహ్మయ్యలు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని మాల్‌లో సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఆందోళన చేశారు.

కొనసాగుతున్న దీక్షలు

తలకొండపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని జేఏసీ నాయకులు హెచ్చరించారు. జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 107 రోజుకు చేరాయి. జేఏసీ నాయకులు, యువకులు, పార్టీల నేతలు పాల్గొన్నారు.

ధర్మబిక్షం ఆదర్శనీయులు

చేవెళ్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమర యోధుడు బొమ్మగారి ధర్మబిక్షం ఆశయాల సాధన కోసం కృషి చేయాలని గీతపని వాళ్ల సంఘం రాష్ట్ర నాయకుడు మల్గాని సుధాకర్‌గౌడ్. కృష్ణగౌడ్ తెలిపారు. ధర్మబిక్షం జయంతి సందర్భంగా శనివారం పట్టణ కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. సత్తిరెడ్డి, వడ్ల మంజుల, నాయకులు శివ, సాయి కిరణగౌడ్ ఉన్నారు.

గ్రామ అధ్యక్షుడిగా రాజేందర్‌రెడ్డి

యాచారం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : యాచారం మండలంలోని మొండిగౌరెల్లి కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడిగా గుర్రం రాజేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. శనివారం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మేకల రాములు, కుంటి ఐలేష్, ప్రధాన కార్యదర్శిగా ఎట్టి చిన్న నరసింహ, కోశాధికారిగా గడ్డం రాజశేఖర్, ప్రచార కార్యదర్శిగా ఎట్టి లక్ష్మయ్య, మరో పది మందిని కార్యవర్గ సభ్యులు ఎన్నుకున్నారు.

క్రైం కార్నర్

కుక్కను తప్పించే క్రమంలో...
అదుపు తప్పిన బైక్, వ్యక్తి మృతి


పాండు (ఫైల్)

చేవెళ్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : కుక్కను తప్పించబోయి బైక్ అదుపు తప్పి కింద పడగా వ్యక్తి మృతిచెందాడు. ఈ ఉదంతం చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి. ఎన్కేపల్లికి చెందిన బేగరి పాండు (35), చేవెళ్ల మండల కేంద్రంలో భార్యాపిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం గ్రామానికి వెళ్లి తిరిగి రాత్రి 9 గంటల సమయంలో చేవెళ్లకు వస్తున్నాడు. దేవునిఎర్రవల్లి గ్రామం గేట్ సమీపంలోకి రాగానే కుక్క బైక్‌కు అడ్డువచ్చింది. దాన్ని తప్పించబోయి అదుపు తప్పి వాహనం పై నుంచి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో అతడి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. వాహనదారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆ మేరకు మృతదేహన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పాండు భార్య పుష్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపారు. దంపతులకు కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఎదురెదురుగా బైక్‌లు ఢీ, ఇద్దరికి గాయాలు


గాయపడిన హరీష్‌రెడ్డి, రాఘవేందర్

షాద్‌నగర్‌రూరల్, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శనివారం సాయంత్రం జరిగింది. కందివనంకు చెందిన రాఘవేందర్((19), షాద్‌నగర్‌కు చెందిన హరీష్‌రెడ్డిల బైక్‌లు కిషన్‌నగర్ శివారులోకి రాగానే ఎదురెదురుగా ఢీ కొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో వీరిద్దరికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇచ్చి, వెంటనే షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి


శంకరయ్య మృతదేహం

చౌదరిగూడ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్లిన వ్యక్తి నీట మునిగి చనిపోయాడు. ఈ సంఘటన కొందుర్గు మండలంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కొత్త ఆగిర్యాలకు చెందిన శంకరయ్య (30) మధ్యాహ్న సమయంలో చెరువులో ఈత కోసం వెళ్లి నీట మునిగి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మమ్మ నలుగురు పిల్లలు ఉన్నారన్నారు. శంకరయ్య తల్లిపోచమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ శ్రీనయ్య తెలిపారు.

గడ్డివాము దగ్ధం

షాబాద్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): గడ్డివాము దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని కుర్వగూడలో చోటు చేసుకుంది. బాధిత రైతు జవాజీ అశోక్ తెలిపిన వివరాల మేరకు... పొలం వద్ద ఉన్న గడ్డివామును శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. మూగజీవాల కోసం తీసుకు వచ్చిన గడ్డిని ఇలా తగులపెట్టడం సమంజసం కాదన్నారు. శనివారం షాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

17న వృక్షార్చన


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

కడ్తాల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన సందర్భంగా ఈనెల 17న గ్రీన్‌ఇండియా ఛాలెంజ్ రూపకర్త జోగినపల్లి సంతోష్‌కుమార్ పిలుపు మేరకు వృక్షార్చన నిర్వహిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని గ్రీన్‌ఇండియా ఛాలెంజ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు, గ్రీన్‌ఇండియా చాలెంజ్ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరు లక్ష్మీనరసింహారెడ్డి వెల్లడించారు. ఆ మేరకు శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు.

యువత క్రీడల్లో రాణించాలి


కప్పును అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్, బీక్యానాయక్

కడ్తాల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): యువత, విద్యార్థులు క్రీడల్లో రాణించాలని టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి నేనావత్ బీక్యానాయక్, మాజీ జెడ్పీటీసీ దశరథనాయక్ అన్నారు. పట్టుదల, ఆత్మస్థైర్యం విజయానికి సోపానం అని పేర్కొన్నారు. కడ్తాల మండలం గడ్డమీదతండాలలో వారం పాటు జరిగిన మైసిగండి ఎంపీటీసీ ఏరియా ప్రీమియర్‌లీగ్ క్రికెట్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. కార్యక్రమానికి శ్రీనివాస్‌గౌడ్, బీక్యనాయక్, దశరథనాయక్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

మాడ్గుల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్రతండా గ్రామపంచాయతీలో తీవ్ర మంచి నీటి ఎద్దడి నెలకొందని కొర్ర తండా వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం తండాలో నల్లాల వద్ద మహిళలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నూతన పంచాయతీ అయిన కొర్రతండాలో తాగు నీటి సమస్యను పరిష్కరించాలని అధికారులకు విన్నవించినా పరిష్కారానికి నోచలేదన్నారు. మిషన్ భగీరథ నీరు ఐదు రోజులకు ఒకసారి సరఫరా అవున్నాయని తెలిపారు. ఇప్పటికైనా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తమ ఆవేదనను అర్థం చేసుకోవాలన్నారు.

ఘనంగా మహా పడిపూజ


చేవెళ్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల మండలం ముడిమ్యాల్‌లో శనివారం శివుడి మహా పడిపూజా కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. శివస్వాములు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు శివుడికి ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వాములు ఆలపించిన పాటలతో ముడిమ్యాల్ గ్రామం శివనామస్మరణతో మారుమోగింది.

ద్వాదశ జ్యోతిర్లింగ మహా పడిపూజ



చౌదరిగూడ ,ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడలో గురుస్వామి భూపాలచారి ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడిపూజ వైభవంగా జరిగింది. శివనామస్మరణతో మండలకేంద్రం మార్మోగింది. శివ స్వాముల భక్తిగీతాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం అకారపు నాగరాజు అన్నదానం నిర్వహించారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి



మహేశ్వరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : రెండు సంవత్సరాలుగా అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని తుమ్మలూరు గ్రామ యువత డిమాండ్ చేశారు. శనివారం మహేశ్వరం - తుమ్మలూరు ప్రధాన రహదారిలో ధర్నాకు దిగారు. రోడ్డు పనులు ప్రారంభించనిదే ధర్నా విరమించేది లేదని భీష్మించారు. అందిన సమాచారం మేరకు సీఐ హెచ్. వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా శాంతించలేదు. ఫోన్‌లో కాంట్రాక్టరుతో ఈ విషయమై మాట్లడడంతో మరో రెండు రోజుల్లో రోడ్డు పనులు ప్రారంభిస్తానని చెప్పడంతో నిరసనను విరమింపజేశారు.